క్లుప్తంగా

జెడ్పీటీసీల శిక్షణ ప్రారంభం



జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఐదో బ్యాచ్ జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈటీసీ ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ ఈ శిక్షణ ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 35 మంది హాజరు కావలసి ఉండగా 17 మంది మాత్రమే హాజరయ్యారు.

తీరంలో పర్యాటకుల సందడి



ఉప్పాడ సాగరతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరంలో గురువారం పర్యాటకులు సందడి చేశారు. రోజురోజుకూ ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చడంతో వేసవి తాపాన్ని తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వచ్చి సేద తీరుతున్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: స్థానిక ఊర చెరువు సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆత్మీయ ఫేస్‌బుక్ గ్రూపు ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆత్మీయ ఫేస్‌బుక్ గ్రూపు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఆత్మీయ ఫేస్‌బుక్ గ్రూపు అడ్మిన్ రవివర్మ, సతీష్‌కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.


నిరుపేదలకు భోజనం అందజేత



సామర్లకోటలో నిరుపేదలకు భోజన ప్యాకెట్లు అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యుడు

సామర్లకోట: పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లోని నిరుపేదలకు లయన్స్ క్లబ్ సభ్యులు భోజనాలు పంపిణీ చేశారు. ప్రతి గురువారం ఒక సభ్యుడు ముందుకు వచ్చి భోజనానికి అయ్యే ఖర్చును భరిస్తున్నారు. పట్టణంలో చెట్ల కింద, రోడ్లపై జీవించే సుమారు 80 మందిని గుర్తించి భోజనం పెడుతున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కటకం గంగబాబు, గుండు శంకరరావు, కర్రి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

18 నుంచి యాసలపు వర్ధంతి కార్యక్రమాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీ స్రవంతి నాయకులు

పెద్దాపురం: కార్మిక నాయకుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్, సీపీఎం నేత యాసలపు సూర్యారావు దశమ వర్ధంతి కార్యక్రమాలను 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జొష్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక వరహాలయ్య పేట సూర్యారావు భవనంలో గురువారం ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ పాల్గొన్నారు.

సస్యానికి మేలు సారపరీక్ష



భూసార పరీక్షలపై వీవీఏలకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ పద్మశ్రీ

- వ్యవసాయ భూముల్లో మట్టి పరీక్షలపై అన్నదాతలకు అధికారుల అవగాహన
- నివేదికను అనుసరించి సారం పెంపునకు సూచనలు, సలహాలు

సామర్లకోట: భూసార పరీక్షలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. మండల పరిధిలో వరి సాగు చేస్తున్న రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేయడానికి అధికారులు వారిని చైతన్యపరుస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. పంట భూములను చెత్త లేకుండా శుభ్రం చేయించుకుని 8 నుంచి 10 మూలల నుంచి 'వి' ఆకారంలో 15 సెంటీమీటర్ల లోతు గుంటలు తీసి మట్టి సేకరించాలి. ఆ మట్టిని బాగా కలిపి నాలుగు భాగాలు చేసి ఎదురెదురుగా ఉన్న భాగాలను తిరిగి కలిపి అర కిలో మట్టి వచ్చే వరకు చేయాలి. ఆ విధంగా చేసిన మట్టిని శుభ్రమైన తెల్లటి గుడ్డలో ఉంచి గ్రామ స్థాయిలో ఉన్న వ్యవసాయ సిబ్బందికి అందజేస్తే వారు భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారు. పరీక్ష అనంతరం వచ్చిన నివేదిక మేరకు మట్టిలో లోపాలను రైతుకు వివరించి తిరిగి సారం పెరగడానికి, పంట దిగుబడులు పెరగడానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. సామర్లకోట వ్యవసాయ క్షేత్రంలో భూసార పరీక్షా కేంద్రానికి మట్టిని తీసుకువచ్చి పరీక్ష చేయించుకోవచ్చు.

అవగాహన పెరిగింది..



నాలుగు ఎకరాల భూమిలో కొనేళ్లుగా వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది పొలానికి వచ్చి భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించడంతో అవగాహన పెరిగింది. సేంద్రియ వ్యవసాయంపై రైతుల సమావేశంలో తెలియజేస్తున్నారు.

– బేతిన జోగారావు, రైతు, వేట్లపాలెం

మండలంలో 536 నమూనాల లక్ష్యం



మండల పరిధిలోని 18 గ్రామాల్లో 536 భూసార పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. భూసారానికి మట్టి నమూనా ఇచ్చిన 10 రోజుల్లో నివేదిక వస్తుంది. దాని ఆధారంగా భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి భూమిలో సారం పెరిగేలా ఎరువుల వినియోగానికి సూచనలిస్తున్నాం. తరచూ పంట మార్పిడి ద్వారా మేలు జరుగుతుంది.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

ఆరోగ్య పట్టణాలే లక్ష్యంగా ఈ-ఆటో



పెద్దాపురంలో ఈ-ఆటోలను ప్రారంభిస్తున్న దొరబాబు

ప్రారంభించిన హౌసింగ్ చైర్మన్ దవులూరి

సామర్లకోట/పెద్దాపురం: ఆరోగ్యవంతమైన పట్టణాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఈ-ఆటోలను అందజేసినట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీల్లో ఈ వాహనాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ పద్ధతిలో ఇప్పటికే తడి, పొడిచెత్త సేకరణకు ప్రతి ఇంటికి మూడు డస్ట్‌బిన్లు అందజేశామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఈ ఆటోల ద్వారా సేకరణ జరుగుతుందని, జగనన్న స్వచ్ఛ సంకల్పాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆయన అన్నారు. సామర్లకోట మున్సిపాలిటీకి 8 ఈ-ఆటోలను కేటాయించారన్నారు. మరో ఏడు త్వరలో వస్తాయని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, అధికార పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలాగే పెద్దాపురం మున్సిపాల్టీకి మంజూరైన 8 ఈ-ఆటోలను దవులూరి దొరబాబు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణలతో కలిసి ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళ వీర్రాఘవులు, పార్టీ పట్టణ అధ్యక్షులు కాపగంటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కవులకు ఆదర్శం శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

పెద్దాపురం: కాదేదీ కవితకనర్హమంటూ ఎందరో కవులకు ఆదర్శప్రాయుడై నిలచి ఎందరో కవులను తయారు చేసిన కవుల కర్మాగారం శ్రీశ్రీ అని వక్తలు పేర్కొన్నారు. శ్రీశ్రీ 40వ వర్ధంతిని గురువారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కార్యదర్శి రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు సాహితి స్రవంతి అధ్యక్షుడు జొష్యుల కృష్ణబాబు, దారపురెడ్డి కృష్ణ, నీలపాల సూరిబాబు మాట్లాడుతూ నిరంతరం కష్టజీవులకు ఇరువైపులా కాపు కాసేవాడే కవి అని నిరూపించిన వ్యక్తి శ్రీశ్రీ అన్నారు. సమాజానికి ఆయన అందించిన రచనలు ఎనలేనివని కొనియాడారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. సిరిపురపు శ్రీనివాస్, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కె.శివ, కవులు, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, సీఐటీయూ నాయకుడు కుంచే చిన్న మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, రాజకీయ బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ రమాప్రభ, తులసీదేవి, కె.సత్యవతి, విజయశాంతి, అమలబేబీ, వెంకటలక్ష్మి, రాఘవమ్మ, సూర్యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సామర్లకోట: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కొరుతూ స్థానిక రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం సాయంత్రం ధర్నా చేశారు. ఈ ఆందోళనకు సంఘ కార్యదర్శి ఎం.రాజేశ్వరి, సంఘ నాయకులు నాయకత్వం వహించారు.

నిర్ణీత గడువులోగా చర్యలు

ఆర్డీవో సత్యనారాయణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: రెవెన్యూ సేవలు, అర్జీలు పరిష్కారంలో నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష, రీ సర్వే ప్రక్రియలో మొదటి దశలో 113 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. రెండో దశ రీ సర్వేకి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యంగా జగనన్నకి చెబుదాం స్పందన ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చే దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ ఏడీబీ రోడ్డు విస్తరణకు చేపట్టిన భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. రైతుల కౌలు హక్కు పత్రాలు సిద్ధం చేయాలని తదితర అంశాలపై తీసుకోవలసిన చర్యలపై ఆర్డీవో సత్యనారాయణ ఆదేశించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

122 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి



కొమరగిరిలో భూముల రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కొత్తపల్లి: కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 122 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని ఆర్డీఓ వి.సత్యనారాయణ తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని కొమరగిరిలో జరుగుతున్న భూముల రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వే ద్వారా భూ సరిహద్దు సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించవచ్చన్నారు. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కొత్తపల్లి మండలంలో 16 గ్రామాలకు గాను 13 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశామన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సముద్రంలో బోటు బోల్తా

మత్స్యకారుడు గల్లంతు



సముద్రంలో బోల్తాపడిన బోటుపై నిలుచున్న మత్స్యకారులు



సముద్రంలో గల్లంతైన కొండయ్య (ఫైల్)

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ గురువారం బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మత్స్యకారుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఉప్పాడ శివారు నాయకర్ కాలనీకి చెందిన వంక పెంటయ్య బోటుపై గురువారం తెల్లవారుజామున అతనితో పాటు మరో ఐదుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా తీరప్రాంతం సమీపంలో సముద్రంలో అలల తాకిడికి బోటు బోల్తా పడింది. తోటి మత్స్యకారుల సహాయంతో నలుగురు మత్స్యకారులు తీరానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో నాయకర్ కాలనీకి చెంది యజ్జల కొండయ్య గల్లంతయ్యాడు. అతని కోసం మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఉష్ణోగ్రతల పెరుగుదల మానవాళికి ప్రమాదం

బోట్‌క్లబ్: ఇటీవలి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం మానవ మనుగడకు ప్రశ్నార్థకంగా మారిందని జేఎన్‌టియూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ అన్నారు. ఉష్ణోగ్రతలు ఇలా కొనసాగితే జీవరాశులు సైతం నశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక రోటరీక్లబ్‌లో గురువారం రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో ఇన్‌పాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజెస్ కాజెస్ అండ్ కాన్సిక్వెన్సెస్ అనే అంశంపై ప్రసంగించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల జనజీవనం అస్తవ్యస్తమై గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలన్నారు. రోటరీ వంటి అంతర్జాతీయ సేవా సంస్థలు పర్యావరణంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు, అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు, క్లబ్ కార్యదర్శి ఆదిత్య, బ్లడ్‌బ్యాంకు చైర్మన్ బాలకృష్ణ, సభ్యుడు చార్మినార్ వర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



కమిషనర్, కౌన్సిలర్ల సమీక్షలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- హౌసింగ్ చైర్మన్ దవులూరి
- కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష

సామర్లకోట: మున్సిపాలిటీకి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో కౌన్సిలర్లు, కమిషనర్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయాల్లో కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతున్నారని సీనియర్ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబులు ఆరోపించారు. మున్సిపాలిటీకి గత పాలక మండలిలో రూ.60 లక్షల విలువైన స్వీపింగ్ మిషన్ వచ్చిందని, దానిని నిరుపయోగంగా వదిలేశారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో వార్డులో పనులు పూర్తి చేయాలని కౌన్సిలర్లు సూచించారు. ఈ మేరకు దొరబాబు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతి వార్డులో పర్యటించి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. ఆయా వార్డుల్లో మంజూరైన డ్రైన్లు, రోడ్ల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన పనులను వేగంగా జరిగేలా కాంట్రాక్టర్లను చైతన్య పర్చాలని కమిషనర్‌కు సూచించారు. పారిశుధ్యం, లైటింగ్, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. దీనిపై ప్రతి రోజు సచివాలయాలను తనిఖీ చేస్తానని కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఆణిముత్యం కావాలి



విద్యార్థులను సత్కరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



చేబ్రోలులో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన జెడ్పీటీసీ నాగ లోవరాజు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు
- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందుతోందని, తద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జగనన్న ఆణిముత్యాలులో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏడుగురు విద్యార్థులను దొరబాబు సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో దొరబాబు మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గతమెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చి విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి వారిని గుర్తిస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందరికీ సమాన విద్యావకాశాలు అందేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థీ చక్కగా చదివి ఫలితాల్లో ఆణిముత్యాల్లా మెరవాలన్నారు. చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో పది, ఇంటర్మీడియెట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏడుగురు విద్యార్థులకు పతకాలు, నగదు బహుమతులు అందించి, వారి తల్లిదండ్రులను దొరబాబు సత్కరించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, పెద్దాపురం, సామర్లకోట ఎంఈఓ సత్యనారాయణ, శివరామకృష్ణ, సామర్లకోట ఎంపీడీఓ శ్రీలలిత, కౌన్సిలర్లు ఆరెళ్ళ వీర్రాఘవులు, విడదాసరి రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, నాగబోయిన రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించారని జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ నాగలోవరాజు ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి నాడు-నేడు పథకంలో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. పేదలకు ఉన్నత విద్య అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరిగెల రామయ్యదొర, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై దృష్టి పెట్టండి

ఎంపీడీఓ అశోక్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

పెద్దాపురం: సచివాలయాల్లోని ఆస్తుల రిజిస్ట్రేషన్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఈ అంశంపై సమీక్షించారు. మండలంలోని వాలు తిమ్మాపురం, సిరివాడ గ్రామాల్లో ఈ ప్రక్రియను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్టు తెలిపారు. మరో 11 గ్రామాలను సచివాలయ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఎంపిక చేసినట్టు తెలిపారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తిరుపతి, మర్లావ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, చదలాడ గ్రామ సచివాలయాల్లో ఇక నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్లను ప్రజలకు చేరువలో అందించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్షించారు. ఈఓపీఆర్డీ మూర్తి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పైపు నుంచి డీజిల్ చోరీ

ముగ్గురి అరెస్టు



పట్టుబడ్డ డీజిల్, నిందితులతో పోలీసులు

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడిలోని ఐఓసీఎల్ ఆయిల్ పైపులైన్ నుంచి డీజిల్ చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ ఆకుల మురళీకృష్ణ వివరాల ప్రకారం కాకినాడ పోర్టు నుంచి ఐవోసీఎల్ కంపెనీకి పైపులైన్ ద్వారా డీజిల్ సరఫరా అవుతుండగా కోరమండల్ కంపెనీ ఈస్ట్‌గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు పైపులైన్‌కు రంధ్రం చేసి, టాప్ బిగించి డీజిల్ చోరీకి పాల్పడ్డారు. దీనిపై ఐఓసీఎల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం సర్పవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీఐ మురళీకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది ఆయిల్ చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించారు. కాకినాడ బీచ్‌రోడ్డులో కోరమండల్ కంపెనీ టీ జంక్షన్ వద్ద కాకినాడ జగన్నాథపురానికి చెందిన పాలెపు సత్తిబాబు, ఏటిమొగకు చెందిన రచ్చా భాగ రాజు, జగన్నాథపురానికి చెందిన వనమాడి బంగార్రాజులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 210 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన డీజిల్‌ను డబ్బాల్లో నింపి రవాణా చేస్తుండగా డీజిల్‌తో పాటు ఆటోను కూడా రికవరీ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్టు తెలిపారు.

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి

కాకినాడ: స్మార్ట్‌సిటీ పథకంలో చేపట్టి వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమై నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఆయా పనులు సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ వెంకట్రావు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. తొలుత జంతుహింసనివారణ సంఘ ప్రాంతాన్ని, ప్రతాప్‌నగర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు కెనాల్‌కు ఇరువైపులా జరుగుతున్న ఆధునీకరణ పనులను, సాలిపేట బాలికోన్నత పాఠశాలను సందర్శించారు.